
క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట ప్రాంతంలో పునఃనిర్మించిన రాజ బంగారమ్మ తల్లి గ్రామ దేవత విగ్రహ ప్రతిష్ఠ పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం 8గంటల నుంచి గణపతిపూజ, పుణ్యావహనం, పంచాగవ్య ప్రసాన, రక్షాధారణ, దీక్షాధారణ, యాగశాల ప్రవేశ పూజలు జరిగాయి. 28న చండీహోమం, ధ్యాన్యాది వాసం, మధ్యాహ్నం గ్రామ ఉత్సవ విగ్రహం , శిఖర పూర్వకంగా దేవతామూర్తి తిరువీధి ఊరేగింపు నిర్వహిస్తారు. 29న ఉదయం 11.25 నిమిషాలకు విగ్రహ ప్రతిష్ఠ కళావాహన పూజ, అనంతరం అన్నసమారాధన చేపడతారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విజయగణపతికి ప్రత్యేక పూజలు


విజయగణపతికి అభిషేకాలు


విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో విజయగణపతికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హస్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు చాణక్య, శ్రీహర్ష ఆధ్వర్యంలో విజయగణపతికి పంచామృతాభిషేకాలు, స్నపనం, అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్ దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న గ్రామ పెద్దలు, యువత

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద నారాయణపట్నం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు రమేష్ కుటుంబం కట్టుబట్టలతో మిగిలిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ.30వేల నగదుతో పాటు రూ.60 వేలు విలువ చేసే నాలుగు మేకలు దగ్ధమయ్యాయి. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామ యువత మానవత్వంతో స్పందించారు. గ్రామంలో విరాళాలు సేకరించి తక్షణ సహాయం కింద రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అట్టాడ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ అట్టాడ కనకారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెత్త సేకరణ బుట్టల పంపిణీ


చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దీపిక

దత్తిరాజేరు: ప్రభుత్వం సమకూర్చిన చెత్తసేకరణ బుట్టలను మండలంలోని గడసాంలో ప్రతి ఇంటికీ సర్పంచ్ నేతేటి దీపిక, పంచాయతీ కార్య దర్శి శ్రీనివాస్ మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని అన్నారు. చెత్తను ఇళ్ల ముందు, కాలువల్లో పారబోయకుండా బుట్టల్లో వేసి ఇళ్ల వద్దకు వచ్చే క్లాప్ మిత్రలకు అందజేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నేతేటి వెంకటరమణ, బూడి గణపతి, సుంకరి శివ తదితరులు పాల్గొన్నారు.

బీమాతో కుటుంబానికి సామాజిక భద్రత

చీపురుపల్లి: తపాలాశాఖలో బీమా పథకాలు తీసుకోవడం ద్వారా కుటుంబాలకు సామాజిక భద్రత లభిస్తుందని తపాలాశాఖ సూపరింటెండెంట్ ఎన్. వి.ఎస్.ఎస్.రాజు అన్నారు. మండలంలోని పి.కె.పాలవలస గ్రామానికి చెందిన గంట్యాడ అప్పలసత్యం ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. అప్పలసత్యం గతంలో తపాలాశాఖలో గ్రూప్ యాక్సిడెంట్ బీమా పాలసీ తీసుకున్నారు. దీంతో ఆయన కుటుంబానికి రూ.10 లక్షల బీమా పరిహారం మంజూరైంది. సంబంధిత చెక్‌ను మృతుడి భార్య కళావతికి తపాలాశాఖ సూపరింటెండెంట్ రాజు పి.కె.పాలవలసలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి కేవలం రూ.399 ప్రీమియం చెల్లిస్తే ఆ కుటుంబానికి ప్రమాద బీమా రూ.10 లక్షలు వరకు ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరూ బీమా చేయించుకోవాలని సూచించారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే ప్రభుత్వ ధ్యేయం

- నగరంలో రూ.1.55 కోట్లతో బిఆర్ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం
- శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ ధ్యేయమని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఇందులో భాగంగానే బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతికి పెద్ద పీట వేస్తున్నామని ఉద్ఘాటించారు. విజయనగరం జిల్లా కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్ర భవనానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మంగళవారం శంకుస్థాపన చేశారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మరో నూతన భవన నిర్మాణానికి రూ.1.55 కోట్లతో శ్రీకారం చుట్టారు. అనంతరం వివిధ సంఘాల ప్రతినిధులు కోలగట్లను ఘనంగా సత్కరించారు. అనంతరం కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ అంబేడ్కర్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆయన అభిమానులు తనను కలిసి నూతన భవనాన్ని నిర్మించాలని కోరగా అందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. కోటి 55 లక్షల రూపాయలతో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం పేరిట నూతన భవనాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకోసం 40 లక్షల రూపాయలు ఇప్పటికే మంజూరైనట్లు తెలిపారు. భారత రాజ్యాంగాన్ని లిఖించిన మహోన్నత వ్యక్తి బాబాసాహెబ్ అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను అనుసరించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. దళితులకు, హరిజనులకు మాత్రమే కాకుండా యావత్ భారతదేశానికి అంబేడ్కర్ తండ్రి వంటి వారిని కొనియాడారు. ఎంతో మేధోసంపత్తితో ఆనాడు రచించిన భారత రాజ్యాంగం నేటి వరకు కొనసాగడం ఆయన విజ్ఞానానికి నిదర్శనమని అన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం అనంతరం అన్ని జాతులు, కులాలు, మతాలు, వర్గాలు తెగలు, కలిసిమెలిసి జీవించడానికి అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే మూల కారణమని శ్లాఘించారు. త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు బోనెల ధనలక్ష్మి, పట్నాన పైడిరాజు, పొట్నూరు శ్రీనివాసరావు, రేగాన రూపాదేవి, దాసరి సత్యవతి, పట్టా ఆదిలక్ష్మి, వివిధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్


రోడ్డు ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్‌లు

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 40వ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్డును ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం ప్రారంభించారు. రూ.12.50 లక్షలతో నిర్మించిన రహదారిని ప్రారంభించి ప్రజావినియోగంలోకి తీసుకురావటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ లయ యాదవ్, స్థానిక కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మిలు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ధ్యేయంగా ఐదేళ్లుగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేసి సఫలీకృతులయ్యారని అన్నారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని అన్నారు. మరింత అభివృద్ధి చేకూరాలంటే మరోసారి శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్ర స్వామిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మేయర్ వి.వి జయలక్ష్మి, కార్పొరేటర్ వింత ప్రభాకర్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉపయుక్తం వైద్య శిబిరాలు


ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు మరింత ఉపయుక్తంగా ఉండగలవని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్థానిక గాజులరేగలో యువత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోలగట్ల ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పేదలకు అందుతున్న వైద్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన కూడా అక్కడున్న వైద్యులచే బీపీ వంటి పరీక్షలను స్వయంగా చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహకులు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి జె. శ్రీనివాసరావు మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఇచ్చిన స్ఫూర్తితో పేదలకు సేవా కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అవసరమైన పేదలకు ఉచితంగా మందులను కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కనుగల రాజా, గార సత్యనారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ


పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న దాతలు

విజయనగరం: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు, కేఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.కాంతారావు యాదవ్ కేర్ హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని 16వ డివిజన్ పరిధిలో గల బడుగు బలహీన పేద వర్గాల ప్రజలకు మంగళవారం ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కాంతారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన స్ఫూర్తితో పేద ప్రజలకు అణగారిన వర్గాల వారిలో ఆర్థిక, సామాజిక చైతన్యం తీసుకువచ్చేందుకు బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముద్దాడ మధు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రీజియన్ కోఆర్డినేటర్ జానకిరామ్, కేఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో కార్పొరేట్ వైద్యం


శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి రాజేష్‌వర్మ


నెల్లిమర్ల రూరల్: కొండగుంపాం శిబిరంలో సేవలందిస్తున్న సిబ్బంది

పూసపాటిరేగ: జగనన్న ఆరోగ్య సురక్షలో కార్పొరేట్ వైద్యం అందుతోందని వైద్యాధికారి రాజేష్ వర్మ అన్నారు. మండలంలోని కోనాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడారు. రోగులను వైద్యులు పరీక్షిస్తున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆన్‌లైన్‌లో రోగి ఆరోగ్య పరమైన విషయాలను నమోదు చేసే విషయాన్ని పరిశీలించారు. మొదట విడత గత ఏడాది సెప్టెంబరు నుంచి అక్టోబర్ వరకు నిర్వహించామని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారికి రెండో విడతలో వైద్యం చేయించుకొన్న వారికి నేరుగా ఇంటికే మందులు సరఫరా చేస్తామన్నారు. ఆరోగ్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు వైద్యాధికారి రాజేష్‌వర్మ మెడికల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో రామతీర్థం బోర్డు డైరెక్టర్ దాడిశెట్టి త్రినాధరావు, బొడ్డు ఎల్లాజీ, దారపు లక్ష్మణరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ సమస్యలతో బాధపడుతున్న సుమారు 308 మంది శిబిరానికి వచ్చి తనిఖీలు చేయించుకున్నారు. కొండవెలగాడ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పీవీ శిరీషా, ధనుంజయ్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి అవసరమైన వారిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కళ్ల సమస్యలతో బాధపడుతున్న పలువురిని పరీక్షించి ఉచిత కళ్లద్దాలకు సిఫార్సు చేశారు. నెల్లిమర్ల మిమ్స్ కళాశాల వైద్య సిబ్బంది హాజరై తమ సేవలు అందించారు. పలువురికి జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్లను ఉచితంగా అందజేశారు. అనంతరం సచివాలయ పరిధిలో సేవలు అందిస్తున్న వలంటీర్లను గ్రామ పెద్దలు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ అప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు గుంటమాని ఉమ, రాజబాబు, కార్యదర్శి కిరణ్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వాన స్థితిలో వెన్‌లక్ లైబ్రరీ

విజయనగరం టౌన్: స్థానిక ఫైర్ స్టేషన్ ఎదురుగా ఉన్న వెన్‌లక్ లైబ్రరీ పరిస్థితి అధ్వానంగా తయారైందని ఏఐఎఫ్‌టియూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెహరా శంకరరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి ఈ లైబ్రరీలో విరిగిపోయిన కుర్చీలు, పెళ్లిళ్ల విడిది కోసం వచ్చిన వారు చేస్తున్న అధ్వానం రోజురోజుకూ పెరిగిపోతుందన్నారు. విడిదికి దిగిన వారందరూ అక్కడ ఫలహారాలు తెచ్చుకుని అక్కడే వడ్డనలు చేస్తూ ఆ ప్రాంతాన్ని నాశనం చేస్తున్నారన్నారు. లైబ్రరీ పర్యవేక్షణ కొరవడిందని, అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

బీఐఎస్‌పై అవగాహన కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఆర్‌ఆర్‌డీఏ జేడీ ఆర్.కేశవరెడ్డి

విజయనగరం రూరల్: భారత ప్రమాణాలపై (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) గ్రామ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన అవసరమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి (ఏపీఆర్‌డీ) అకాడమీ డైరెక్టర్ ఆర్ కేశవరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు విజయనగరం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని జిల్లా వనరుల కేంద్రంలో భారత ప్రమాణాలపై (బీఐఎస్) మంగళవారం నిర్వహించిన వర్క్‌షాపును ఏపీఆర్‌డీ అకాడమీ డైరెక్టర్ కేశవరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత ప్రమాణాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని గ్రామస్థాయికి తీసుకువెళ్లడానికి పంచాయతీరాజ్ శాఖతో సంయుక్తంగా బీఐఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ వర్క్‌షాపుతో ఐఎస్ఐ, హాల్ మార్క్ వంటి నాణ్యతా ప్రమాణాల ప్రాముఖ్యంతో పాటు వాటి పరిధిలోకి వచ్చే వస్తువుల వినియోగంపై సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు అవగాహన పెంపొందించుకుని ప్రజలకు తెలియజేయాలని కోరారు. వచ్చే నెల 6 వరకు ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఐఎస్ చెన్నై సౌత్‌జోన్ జేడీ ఆర్.తిరుమలరావు భారత ప్రమాణాల ప్రాధాన్యతను, వాటి పరిధిలోకి వచ్చే వస్తువులను, హాల్‌మార్క్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో విజయనగరం డీఎల్‌డీవో జీఎస్ నిర్మలాదేవి, డీపీఆర్‌సీ ఏవో వేదవతి, డీపీఆర్‌సీ శిక్షణ మేనేజర్ ఎ.దేవుడు, ఆర్పీలు రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


మస్తర్ల సీట్లను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: మండలంలోని బి.రాజేరు గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ ఎస్.హరిహరరావు మంగళవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్ల సీట్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతీ వేతనదారుడికి పని కల్పించాలని ఫీల్డ్‌అసిస్టెంట్‌కు సూచించారు. పనిప్రదేశంలో తప్పనిసరిగా తాగునీరు, నీడ కోసం టెంట్లు ఉండేలా చూడాలన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.రమణ అన్నారు. పట్టణంలో పలుచోట్ల మంగళవారం ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డుకు రూ.2వేలు కోట్లు జమ చేసి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 28, 29 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గ కేంద్రాల్లో రిలే నిరాహారదీక్షలు చేపడుతున్నామన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.త్రినాధరావు, ఎన్.కృష్ణారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు పోరాటానికి మద్దతుగా వాల్‌పోస్టర్ విడుదల


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న అప్పలరాజు, తదితరులు

విజయనగరం ఫూల్‌బాగ్: కేంద్రంలోని బీజేపీ పాలకులు గతంలో రైతులకు ఇచ్చిన హామీల ప్రకారం పండించిన పంటకు మద్దతు ధర కోసం చట్టం రూపొందించాలని పంజాబ్, హర్యానా, ఢిల్లీ సరిహద్దులో ఈ నెల 13నుంచి రైతులు ఉద్యమిస్తుండగా వారిపై కాల్పులు జరిపి యువ రైతును పొట్టన పెట్టుకోవటం దారుణమని నవ యువ సమాఖ్య ప్రతినిధి ఎం. అప్పలరాజు, పీడీఎస్ఓ ప్రతినిధి బి.రాకేష్ అన్నారు. రైతు పోరాటానికి మద్దతుగా మంగళవారం వైఎస్సార్ నగర్‌లో వారు వాల్‌పోస్టర్ విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ రైతాంగం సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.గిరిప్రసాద్, ఎస్.దిలీప్, నాగరాజు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ‘లిప్’ అమలు చేయాలి


బాలికోన్నత పాఠశాలలో మాదిరి పాఠ్యాంశ బోధన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు


నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో (లిప్) అభ్యసనాభివృద్ధి పక్కాగా అమలు చేయాలని లిప్ స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఉపేంద్ర రెడ్డి సూచించారు. స్థానిక డైట్ కళాశాలలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో లిప్ అమలు, బోధన నిర్వహణ, విద్యాస్థాయి మెరుగు తీరు తదితర అంశాలపై డైట్ అధ్యాపక బృందంతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఉపేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యా స్థాయి మెరుగు కోసం ఎంఈఓలు, హెచ్ఎంలు, డైట్ అధ్యాపకులు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే డైట్ నుంచి వెళ్లే పరిశీలకులు ఆయా పాఠశాలల్లో లిప్ అమలుపై తెలుసుకుని వెళ్లాలని సూచించారు. అనంతరం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలను సందర్శించి 8వ తరగతి విద్యార్థులకు మాదిరి పాఠ్యాంశ బోధన, సోపానాలు వారీగా బయాలజీ టీచర్ సుజాత ఆధ్వర్యంలో పాఠ్య బోధన అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, అధ్యాపకులు ఎంఎస్ఆర్ శర్మ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి


లలిత సంగీత గీతాలాపన చేస్తున్న గాయకులు

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 66వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తపేటలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన లలిత సంగీత విభావరి ఆద్యంతం ఆకట్టుకుంది. రేపల్లె రవికుమార్ సంగీత దర్శకత్వంలో హారిక శివరాం, లలిత కుమారి, రామరత్నం, సాయి సంపత్, సంగీత్ కుమార్‌లు చక్కని లలిత గీతాలాపన చేశారు. తబలపై చక్రపాణి సహకారమందించారు. భైరవభట్ల అన్నపూర్ణ, మహేశ్వరరావు, అబ్బులు, శారద కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మండపాక రవి, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఎడ్ల పరుగు పోటీలు


లక్కవరపుకోట: పోటీల్లో పరుగు తీస్తున్న ఎడ్లు

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురం గ్రామంలో మరిడమాంబ తీర్థం సందర్భంగా మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలు ఉల్లాసంగా సాగాయి. ఈ పోటీల్లో విజయనగరం,అనకాపల్లి జిల్లాలకు చెందిన 12 ఎడ్ల బళ్లు పాల్గొన్నా యి. ఈపోటీల్లో వల్లంపూడి, వాయిలపాడు గ్రామాలకు చెందిన ఎడ్లు ప్రథమ, ద్వితీయస్థానంలో నిలిచాయని నిర్వా హకులు తెలిపారు. ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

నేడు నల్లబిల్లిలో..

వేపాడ: మండలంలోని నల్లబిల్లి గ్రామంలో మల్లికార్జునస్వామి తీర్థం సందర్భంగా బుధవారం సాయంత్రం ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వ హించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరుస అయిదు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. భ్రమరాంబ, మల్లికార్జునస్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.